## డిమాండ్ మేరకు బొగ్గు ఉత్పత్తికి చర్యలు

- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

గోదావరిఖని, మే 29: రానున్న రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వ బొగ్గు సంస్థలు డిమాండ్ మేరకు తగినట్లుగా నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి జరిగేలా కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలో కోల్ ఇండియా, సింగరేణిపై బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లు, తీసుకోవాల్సిన చర్యలపై బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్‌దత్, ఉన్నతాధికారులతో జరిగిన కీలక వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో మంత్రి పేర్కొన్నారు. కాగా సింగరేణి భవన్ నుంచి సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ప్రగతి, భవిష్యత్ ప్రణాళికల అంశాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్మికుల జీతాలు, సంక్షేమంపై ఇబ్బందులు లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చును తగ్గించాలన్నారు. పని సంస్కృతి మెరుగుపరుచాలని సూచించారు. ఉత్పత్తి ఖర్చు తగ్గింపుకు సింగరేణి అధికారులు, బొగ్గు మంత్రిత్వశాఖ నిపుణులతో కమటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో సింగరేణి డైరెక్టర్లు డీ సత్యనారాయణ, ఎల్వీ సూర్యనారాయణరావు, కే వెంకటేశ్వర్లు, ఈడీ ఎస్డీఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

## పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

- రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝూ

ఫర్టిలైజర్‌సిటీ, మే 29: శాంతిభద్రతల విషయంలో పోలీస్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఆదేశించారు. గురువారం కమిషనరేట్‌లో నిర్వహించిన నెలవారీ సమీక్ష జరిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీసు అధికారులతో సీపీ సమావేశమయ్యారు. ముందుగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్తుల అరెస్టులు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జీషీట్‌కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గ్రేవ్‌కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, పోక్సో కేసులు, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాద కేసుల పరిష్కారానికకి తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కేసు పరిశోధన పారదర్శకంగా ఉండాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మహిళలపై జరిగిన నేరాల కేసుల్లో దర్యాప్తు వేగవంతంతో నిందితులకు కోర్టులో శిక్షలు పడేవిధంగా సాక్ష్యాలను కోర్టుకు అందజేయాలన్నారు. తరచూ నేరాలకు పాల్పడే వారిపై సస్పెక్ట్ రౌడీ షీట్ ఓపెన్ చేయాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించి ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. ఇక్కడ పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, అడిషనల్ అడ్మిన్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ మల్లారెడ్డి, గోదావరిఖని, మంచిర్యాల్, పెద్దపల్లి, జైపూర్, బెల్లంపల్లి ఏసీపీలు రమేశ్, ప్రకాశ్, కృష్ణ, వెంకటేశ్వర్లు, రవికుమార్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

## వడ్ల కొనుగోలులో పెద్దపల్లి ముందంజ

- ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి టౌన్, మే 29: వడ్ల కొనుగోలులో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే పెద్దపల్లి నియోజకవర్గం ముందంజలో నిలిచిందని ఎమ్మెల్యే విజయరమణారవు పేర్కొన్నారు. గురువారం ఉమ్మడి జిల్లా కరీంనగర్ కలెక్టరేట్‌లో వరి ధాన్యం కొనుగోల్లు, భూ భారతి, ఇందిరమ్మ ఇండ్లు, ఖరీఫ్ సిజన్ సన్నద్దతపై నిర్వహించన సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడారు. గత ఖరీఫ్ సీజన్‌లో రూ. 1234 కోట్ల రూపాయలు, సన్న వడ్లకు బోనస్‌గా చెల్లించడంతోపాటు రూ.114 కోట్ల రూపాయలు పెద్దపల్లి జిల్లా రైతులకు చెల్లింపులు జరిగాయని, దీంతోపాటుగా రూ. 59 కోట్లు పెద్దపల్లి నియోజకవర్గ రైతులకు అందయన్నారు. వరి ధాన్యం కొనుగోల్లు చేసి రైతులకు డబ్బులు చెల్లింపులు రాష్ట్రంలోను అగ్రగామిగా నిలిచిందన్నారు. జిల్లాలో 3.66 లక్ష్యల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఐకేపీ కొనుగోలు సెంటర్ల ద్వారా 91శాతం డబ్బులు రైతులకు సకాలంలో ఖాతల్లో జమ చేశామని తెలిపారు. పత్తిపాక రిజర్వార్ నిర్మాణం చేపట్టితే నియోజకవర్గ రైతుల సాగునీటి కష్టాలు దూరమవుతాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వి జ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయిం పు ప్రక్రియలో సాంకేతిక కారణాలు ఎదురవుతున్నదని వీటిని అదిగమించాలని కోరారు. వానకాలం సీజన్‌లో రైతులకు ఎరువులు, విత్తనాలు అందజేతపై వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యేలు, దనపు కలెక్టర్ అరుణశ్రీ పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎలిగేడు,మే 29 : ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు మండలంలో గురువారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అర్హులైన పేదలందరికీ పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని అన్నారు. బుర్హాన్ మియాపేట, సుల్తాన్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు. బుర్హాన్ మియాపేటలో రూ.పదిలక్షలతో నిర్మాణం చేసిన సీసీ రోడ్డు, డ్రైనేజీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో భాస్కర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు హర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కొండ తిరుపతిగౌడ్, మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, పల్లెర్ల వెంకటేశ్ గౌడ్, చంద్రగిరి పరశురాములు, ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### శాతవాహనలో ఎల్ఎల్‌బీ 4వ సెమిస్టర్ వన్ టైం ఛాన్స్

కార్పొరేషన్, మే 29 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో న్యాయ బాచిలర్ ఆఫ్‌లా (ఎల్ఎల్‌బీ) ఆరో సెమిస్టర్ పరీక్షలు జూన్ 5 నుంచి 11 వరకు సాగుతున్నాయని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డా. సురేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎల్‌బీ 4వ సంవత్సరం బ్యాక్ లాగ్ పరీక్ష ప్రత్యేక రుసుంతో అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు జూన్ 3లోగా తమ కళాశాలల్లో ఫీజు ప్రతి పేపర్‌కు రూ.1500 చెల్లించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఆయా కళాశాల్లో గాని, విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

'నమస్తే' కథనానికి స్పందన

## చకచకా సాగుతున్న లిఫ్ట్ ఏర్పాటు పనులు

పెద్దపల్లి, మే29: పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో లిఫ్ట్ ఏర్పాటు పనులు చక చక సాగుతున్నాయి. పెద్దపల్లి మున్సిపల్ నూతన భవనాన్ని రూ. 6.5 కోట్ల వ్యయంతో జీ ప్లస్ 3 అంతస్తులతో నిర్మించారు. గతేడాది డిసెంబర్ 4న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. కానీ లిఫ్ట్ లేక వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని 'మెట్లెక్కలేక ఇబ్బందులు...' అనే శీర్షికతో ఈనెల 9న నమస్తే తెలంగాణలో ప్రచురిచతం కాగా, సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి లిఫ్ట్ ఏర్పాటు పనులు చక చక చేయిస్తున్నారు. నిర్మాణ పనులు తుది దశకు చెరుకున్నాయి. వారం రోజుల్లో లిఫ్ట్‌ను అందుబాటులో తెస్తామని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ తెలిపారు.



మున్సిపల్ కార్యాలయంలో సాగుతున్న లిఫ్ట్ ఏర్పాటు పనులు

## గర్రెపల్లి గురుకుల విద్యాలయం అభివృద్ధికి రూ.5 లక్షలు



చెక్కు తీసుకుంటున్న ప్రిన్సిపల్స్ గిరిజ

సుల్తానాబాద్‌రూరల్,మే29: గర్రెపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో ఇటీవల విడుదలైన పది, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించినందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురుకుల విద్యాలయం అభివృద్ధికి మంజూరు చేసిన రూ. 5లక్షల చెక్కును ప్రిన్సిపల్ సీహెచ్ గిరిజాకు అందజేశారు. ఈ నెల 28న హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రిన్సిపాల్ గిరిజను సన్మానించి అభినందించారు. గర్రెపల్లి గురుకుల విద్యాలయం అభివృద్ధికి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. గర్రెపల్లి గురుకుల విద్యార్థులు మంచి ఫలితాలను సాధించడంపై పలువురుప్రిన్సిపాల్‌ను అభినందించారు.

## ఇసుక లారీలను నియంత్రించడంలో విఫలం



మాట్లాడుతున్న నాయకులు

మంథని రూరల్, మే 29: ఇసుక లారీలను నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. ఇసుక లారీల తీరుపై ప్రజా సంఘాల నాయకులు మండలంలోని గద్దలపల్లి వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అడవి సోమనపల్లి క్వారీకి వెళ్లే ఇసుక లారీ దారి తప్పి ఖమ్మంపల్లి ఇసుక క్వారీకి వెళ్లిందని, అక్కడ ఇసుక లోడ్ చేయకపోవడంతో తిరుగు ప్రయాణంలో డ్రైవర్ మద్యం మత్తులో ఉండి అధిక స్పీడ్‌తో వెళ్లి ప్రమాదం చేశారన్నారు. ఆ సమయంలో జన సంచారం లేక పోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. డ్రైవర్లు మద్యం తాగి అధిక లోడుతో వేగంగా వాహనాలు నడుపుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు . ఇసుక లారీలను నియంత్రించడంలో అధికారులు విఫలం చెందారని, మంథని నియోజకవర్గంలో విచ్చలవిడిగా ఇసుక మాఫియా కొనసాగుతుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఆర్ల సందీప్, సురేష్, అడ్డూరి రాజయ్యా, అడ్డూరి సంపత్, ముత్యాల దుర్గయ్య, రాజేశ్ పాల్గొన్నారు.

## సింగరేణి గోప్యనీయ సమాచారం అందిస్తే చర్యలు

గోదావరిఖని, మే 29: సింగరేణికి సంబంధించిన గోప్యత కలిగిన డాక్యుమెంట్లను బయటి వారికి ఇస్తే చర్యలు తీసుకుంటామని సింగరేణి డైరెక్టర్(పీపీ,పర్సనల్) గురువారం సర్క్యులర్ జారీ చేశారు. సమాచారం కోసం అధికారులను బెదిరింపులకు, ఒత్తిడికి గురిచేస్తున్నట్లు తెలుస్తుందని, బెదిరింపులకు గురికావాల్సిన అవసరం లేదని యాజమాన్యంకు ఫిర్యాదు చేయాలన్నారు. కంపెనీలో వివిధ కిందిశాఖల నుంచి పై శాఖల వారికి పంపించే నోట్‌ఫైల్స్, ముఖ్యమైన పత్రాలను అత్యవసర సమయంలో కంపెనీ మెయిల్ ద్వారా పంపించవచ్చున్నారు. వాట్సాప్ ద్వారా పంపించకూడదని మరో సర్క్యులర్‌లో డైరెక్టర్ పా హెచ్చరించారు.

## సేవకు దక్కిన గౌరవం

- చిన్న వయసులో 14సార్లు రక్తదానం
- స్ఫూర్తి పురస్కారానికి దేవి రోహిత్

కోల్‌సిటీ, మే 29: గోదావరిఖనికి చెందిన దేవి రోహిత్ సేవకు గౌరవం దక్కింది. తండ్రి బాటలో తనయుడిగా చిన్న వయసులోనే 14సార్లు రక్తదానం చేయడంతోపాటు అతని స్నేహితులతో కూడా రక్తదానానికి ప్రోత్సహిస్తున్నాడు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ గోదావరిఖని క్లబ్ ట్రైనర్‌గా సమాజ హిత, ఆధ్యాత్మికత, యోగా తదితర సేవా కార్యక్రమాల్లో వలంటీర్‌గా సేవలందిస్తున్నాడు. ఇతని సేవలను గుర్తించిన వసుంధర విజ్ఞాన వికాస మండలి 32వ వార్షికోత్సవం సందర్భంగా జూన్ 10వ తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే ఉత్సవాల్లో స్ఫూర్తి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు జ్యూరీ కమిటీ ప్రకటించింది. కాగా, తండ్రి స్ఫూర్తిగా అతని వారసత్వం పునికిపుచ్చుకొని స్ఫూర్తి పురస్కారంకు ఎంపికైన రోహిత్‌ను గురువారం గోదావరిఖనిలోని పలు స్వచ్ఛంద సేవా సంఘాల సభ్యులు, జేసీఐ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

### ఎల్‌బీ నగర్ కూడలి విస్తరించాలి

కోల్‌సిటీ, మే 29: గోదావరిఖని ఎల్.బీ నగర్ కూడలిని విస్తరించే చర్యలు చేపట్టాలని సీపీఐ ఎల్‌బీ నగర్ శాఖ కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. నగరంలోని ప్రధాన కూడళ్లను విస్తరిస్తున్నా దశాబ్దాల కాలంగా ఎల్‌బీ నగర్ కూడలి విస్తరించకపోవడంతో రోడ్లు చిన్నగా ఉండి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎల్‌బీ నగర్ ప్రధాన ద్వారాన్ని జంక్షన్‌గా తీర్చిదిద్దాలని కోరారు. ఎల్‌బీ నగర్‌కు పక్కనే నర్సింగ్ కళాశాల నిర్మాణం పనులు జరుగుతున్నందున ఈ కూడలిని విశాలంగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీసీ, స్కూల్ బస్సులు రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. 32వ డివిజన్ పరిధిలోని ఎల్‌బీ నగర్‌లో నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాలు కూడా తొలగించాలని కమిషనర్‌ను ప్రకటనలో కోరారు.

## హామీలను విస్మరిస్తున్న గుర్తింపు సంఘం

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి
- ఓసీపీ -2లో యూనియన్‌లో భారీగా చేరికలు



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

రామగిరి, మే 29: సింగరేణిలో గెలిచిన గుర్తింపు కార్మిక సంఘం కార్మికులకు ఇచ్చిన హామీలు గాలికి వదిలి కార్మికుల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు. ఆర్జీ -3 డివిజన్‌లోని ఓసీపీ–2లో ఫిట్ సెక్రటరీ వేముల రవిశంకర్ అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజ రయ్యారు. ఈ సందర్భంగా మినిస్టీరియల్ స్టాఫ్ క్లరికల్ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్లు ఎండి షరీఫ్, జె మనోహర్, నాగారపు శ్రీనివాస్, ఉడుత వేద వ్యాస్, ఊకంటి శ్రీనివాస్ కాంపల్లి సత్యనారాయణ సీనియర్ నాయకులు ఉపేంద్ర చారి తదితరులు సుమారు 20 మంది కార్మికులు టీబీజీకేఎస్‌లో చేరారు. వారందరికీ యూనియన్ కండువాలు కప్పి సాధారంగా యూనియన్‌లోకి ఆహ్వానించా రు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడారు. గతంలో జాతీయ సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను కారుణ్య నియామకాల పేరిట ఇప్పించిన ఘనత టీబీజీకేఎస్‌కే దక్కు తుందన్నారు. ఇదే వేదిక మీద కొత్తగా జాయిన్ అయిన సీనియర్ అసిస్టెంట్ ఎండీ షరీఫ్, ఆర్జీ–3, ఏపీఏ డివిజన్‌ల టీబీజీకేఎస్ తరపున క్లరికల్ స్టాఫ్ ఇన్చార్జిగా నియమించినట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో యూనియన్ ఆర్జీ–3 ఏపీఏ ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య, ఉప ప్రధాన కార్యదర్శి పిగిలి సంపత్ రెడ్డి, సీనియర్ నాయకులు గంధ్ర శేషగిరిరావు కేంద్ర కమిటీ సభ్యులు పర్స బక్కయ్య, దేవ శ్రీనివాస్, ఈసంపల్లి రమేశ్, పాశం శ్రీనివాస్ రెడ్డి, ఉరకొండ రమేశ్, నాయకులు సుద్దాల తిరుపతి ,దాసరి మల్లేశ్, నడిపెల్లి ప్రదీప్ రావు, వీరగోని సంతోష్ , గణేష్, వెంకటేష్ ,సురేశ్, వీవీగౌడ్, క్రాంతి యాదవ్, గండి శ్రీనివాస్, సతీశ్, శేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి, చింతల శ్రీనివాస్ రెడ్డి, మోహన్, సుధాకర్ రావు, మూగ శ్రీనివాస్, సహదేవ్, అన్ని విభాగాల కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

## కార్మికుల ఆరోగ్య సంరక్షణకు సంసిద్ధం

- వైద్యాధికారులు సామర్థ్యాన్ని నిరుపించుకోవాలి
- సింగరేణి సీఎండీ బలరామ్

గోదావరిఖని, మే 29: సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంరక్షణ కోసం యాజమాన్యం ఏటా రూ. 400 కోట్లు ఖర్చు చేయడానికి సంసిద్ధంగా ఉందని, సింగరేణి వైద్యులు మీ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని సింగరేణి సీఎండీ బలరామ్ పేర్కొన్నారు. గురువారం సింగరేణి భవన్‌లో సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియా ప్రధాన దవాఖానల వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎండీ మాట్లాడారు. అన్ని కేసులను రిఫెరల్‌కి పంపితే ఇక మన నైపుణ్యత ఏమిటన్నారు. సమయపాలన పాటిస్తూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు. వైద్యసేవల కోసం ఖర్చుకు వెనకాడకుండా అన్ని రకాల వైద్య పరీక్ష యంత్రాలు, మందుల సమకూర్చడానికి యాజమాన్యం సిద్ధంగా ఉందని ఇప్పటికి పలుమార్లు చెప్పిన ఇంకాను కొన్ని దవాఖానల నుంచి ప్రతిపాదనలు పంపడంలో శ్రద్ధ వహించడం లేదని సింగరేణి వైద్యశాఖపై సీఎండీ అగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే దవాఖాన యాజమాన్యం వారికి కావాల్సిన కనీస వైద్య పరికరాలు, అవసరమైన మందుల ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఇప్పటికి ఏరియా దవాఖానలకు వైద్యులను కేటాయించామని, చిన్నపాటి ఆరోగ్య సమస్య ఉన్న రోగులకు ఏరియా దవాఖానలో వైద్యం అందించే అవకాశం ఉన్నప్పటికి హైదరాబాద్‌కు రెఫర్ చేయడంతో తద్వారా గత మూడేళ్లలో రూ.30కోట్లు ఉన్న రెఫర్ బిల్లులు, ఇప్పుడు రూ.100కోట్లకు చేరినట్లు తెలిపారు. కంపెనీ వైద్యులు తమ నైపుణ్యత చూపించకుండా చిన్న కేసును రెఫర్ చేయడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. వైద్యులు అంకితభావంతో వైద్యసేవలు అందించాలన్నారు. ఇక్కడ సంస్థ డైరెక్టర్లు సత్యనారాయణరావు, సూర్యనారాయణరావు, వేంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్ డీఎం సుభానీ, రాజశేఖర్‌రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్‌కుమార్, వైద్యాధికారులు ఉన్నారు.

## గురుకుల సొసైటీ కార్యదర్శి క్షమాపణ చెప్పాలి

గోదావరిఖని, మే 29: ఎస్సీ విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఇటీవల మాట్లాడిన గురుకుల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని టీఎస్ ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు తిమోతి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇక్కడ చదువుకుంటున్న వాళ్లు ఏవరూ ఉన్నత కుటుంబాలకు చెందిన వారు కాదని, కుర్చున్న దగ్గరికి తిండి రాదు, పనులు చేయాల్సిందే, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాల్సిందే అని అలుగు వర్షిణి చేసిన వ్యాఖ్యలు దళితుల పట్ల ఉన్న చులకను భావానికి నిదర్శనమన్నారు. పేద వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఏర్పడిన గురుకుల సంస్థ వేదికపై చేసిన వాఖ్యాలు కేవలం ఎస్సీ విద్యార్థులపై దాడిగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం ఇట్టీ వాఖ్యాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం

రామగిరి, మే 29: జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ గారి నేతృత్వంలో మాజీ జడ్పీటీసీ గోపగాని సారయ్య, నల్ల మనోహర్ రెడ్డి పాల్గొని గురువారం జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు కల్వచర్లకు చెందిన దంపతులు నూనె రాజేశం,మల్లేశ్వరిని ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

## సాగునీటి కాలువలను శుభ్రం చేయాలి

పెద్దపల్లి రూరల్, మే 29: రైతుల పంట పొలాలకు సాగునీరు అందించి సాగుకు ఉపయోగపడేలా ఎస్సారెస్పీ కాలువలను పూడిక మట్టితో పాటు, చెత్తా చెదారాన్ని తొలగించాలని పెద్దపల్లి ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెద్దకల్వలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న ఎస్సారెస్పీ కాలువల్లో పూడిక తీత, చెత్తాచెదారం తొలగింపు పనులను ఎంపీడీవో, అధికారులు, సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. ఇక్కడ గ్రాపంచాయతీ కార్యదర్శి దేవరనేని నిషాంత్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ శ్రామ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

మంథని, మే 29: కోరియర్, హోమ్ సర్వీస్, ఫుడ్ డెలవరీ, ఏసీ టెక్నికల్, గ్రాఫిక్ డిజైనర్స్, వీడియో ఎడిటర్స్‌గా పని చేసే వారు ఈ శ్రామ్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని మంథని సహాయ కార్మిక శాఖ అధికారి డి. రవీందర్ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జోమాటో, స్విగ్గి సంస్థల్లో పని చేసే వారిని గిగ్ కార్మికులుగా గుర్తిస్తూ సంక్షేమ పథకాలు వర్థింపచేస్తున్నదన్నారు. దీనికి అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాల కోసం హెల్ప్ లైన్ నెంబర్ 14434కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలన్నారు.

## పెళ్లి కాదేమోననే బెంగతో యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, మే 29: కుటుంబ పరిస్థితులను బేరీజు వేసుకుని మనస్థాపానికి గురైన యువకుడు తనకు ఇక పెండ్లి కాదేమోననే బెంగతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో చోటు చేసుకుంది. బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

అప్పన్నపేట గ్రామానికి చెందిన అనాసి రాజు–భారతి దంపతులకు ఒక కూతురు, ఒక కొడుకు కాగా కూతురుకు పెళ్లి కావడంతో సాయిరాం(28) ఒక్కడే తల్లిదండ్రుల వద్ద ఉంటూ మొబైల్ పాయింట్‌లో పని చేసుకుంటూ తల్లిదండ్రుల తో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 23న పెళ్లి కాదేమోననే బెంగతో ఉంటున్న సాయిరాం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ దవాఖానకు తరలించి వైద్యం చేయిస్తున్నారు. దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి మృతిచెందాడని, మృతుని తల్లి భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ కే స్వామి తెలిపారు.

### పతి రైతుకు విశిష్ట సంఖ్య

అంతర్గాం, మే 29: ప్రతి పౌరుడికి ఆధార్ కార్డు మాదిరిగా ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య కేటాయించే ప్రక్రియ జరుగుతుందని అంతర్గాం మండల వ్యవసాయ అధికారి సతీష్ తెలిపారు. ఈమేరకు మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో గురువారం రైతుల వివరాలు ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం చేప ట్టారు. రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ వివరాలు ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు దోహద పడుతుందనీ, ముఖ్యంగా పీఎం కిసాన్ వచ్చే విడత లబ్ధి కొరకు ఫార్మర్ రిజిస్టర్‌లో తప్పక నమోదు చేసుకోవాలన్నారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ప్రస్తుతం ఫార్మర్ రిజిస్ట్రీతో ఏ సంబంధం లేదనీ, ఐడీ కొరకు రైతులు ఆధార్‌ట, పట్టా పాస్‌పుస్తకం, ఆధార్‌కు లింక్ చేసిన సెల్ నంబర్‌తో సమీప వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### విగ్రహాన్ని ధ్వంసం చేసిన గుర్తు తెలియని దుండగులు

ఓదెల, మే 29: పొత్కపల్లి రైల్వే గేట్ దగ్గర శానగొండ గ్రామానికి వెళ్లే రహదారి పక్కన ఉన్న పోచమ్మ ఆలయం వద్ద ఉన్న పోతలింగం విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు బుధవారం రాత్రి ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. పోతలింగం విగ్రహం కింద పడి ఉండడంతో రెండు ముక్కలుగా పగిలింది. దీంతో స్థానిక బీజేపీ నాయకులు విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని పట్టుకుని శిక్షించాలని కోరుతూ రోడ్డు పై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేశ్ నిరసనకారులకు నచ్చజెప్పి విరమింపజేశారు. నిందితులకు పట్టుకుంటామని తెలిపారు. కాగా ఆలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పొత్కపల్లి రైల్వే గేట్ వద్ద అప్పటికప్పుడు సీసీ కెమెరాను పోలీసులు ఏర్పాటు చేశారు. నిరసనలో బీజేపీ నాయకులు శనగరపు రమేశ్, పుల్లూరి పృథ్వీరాజ్, రాకేశ్, పులి కొముయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఖని బాలికకు అంతర్జాతీయ అవార్డు

కోల్‌సిటీ, మే 29: గోదావరిఖనికి చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి ఎం.సహస్రకు అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించింది. ఇండోనేషియాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలో తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లిజిల్లా గోదావరిఖనికి చెందిన సహస్ర స్వర్ణ పతకం సాధించింది. ఈమేరకు గోదావరిఖనికి గురువారం రాత్రి రాగా క్రీడాభిమానులు, పలు పార్టీల నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. కోచ్ తరుణ్, తల్లిదండ్రులను అభినందించారు.

### భూపతిపూర్‌లో భూ కబ్జాపై అధికారుల విచారణ

సుల్తానాబాద్‌రూరల్,మే29: మండలంలోని భూపతిపూర్ ఎస్సీకాలనీలో భూ కబ్జాపై అధికారులు విచారణ జరిపారు. 111 సర్వే నెంబర్‌లో భూమి కబ్జా విషయంపై కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాద్ మేరకు గురువారం పెద్దపల్లి డిఎల్‌పీవో వేణుగోపాల్ గ్రామానికి వచ్చి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్సీ కాలనీ, గ్రామస్తుల సమక్షంలో విచారణ జరిపి, నివేదికను ఉన్నత అధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఇందులో సుల్తానాబాద్ ఎంపీవో సమ్మిరెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి ఆసీయా బెగం, ఎస్సీ కాలనీ వాసులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

### జూలపల్లి జీపీని తనిఖీ చేసిన డీపీవో

జూలపల్లి, మే 29 : జూలపల్లి పంచాయతీ కార్యాలయాన్ని గురువారం డీపీవో వీరబుచ్చయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిజిష్టర్లు, సిబ్బంది పని తీరు పరిశీలించారు. వాడ వాడలా చేపడుతున్న పారిశుధ్య పనులు పర్యవేక్షించారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ క్రమబద్దీకరించుకోవాలని పేర్కొన్నారు. సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట ఎంపీవో అనిల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఖాజ ఉన్నారు.

## సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

ధర్మారం, మే 29: పంటలు సాగు చేసే సమయంలో సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చు అని ఈ దిశగా రైతులు దృష్టి సారించాలని రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకన్న, డాక్టర్ కిరణ్, హైదరాబాద్ ఐకార్ శాస్త్రవేత్తలు డాక్టర్ సురేశ్, డాక్టర్ బాబ్జి, డాక్టర్ పాల్ యాదవ్ సూచించారు. ఈ మేరకు గురువారం మండలంలోని బొమ్మారెడ్డిపల్లి, బొట్ల వనపర్తి, దొంగతుర్తిలో ముందస్తుగా వానకాలం పంటల సాగు, విత్తనాలు ఎంపిక, యాజమాన్య పద్ధతులపై రైతులకు కృషి సంకల్యాప్ అభియాన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సీజన్కి సిద్ధంగా ఉండాలన్నారు. అధీకృత విత్తన దుకాణాలలో నే విత్తనాలు కొనుగోళ్లు చేయాలన్నారు. విత్తనాలు కొన్న తర్వాత రసీదులను పంట కాలం పూర్తి అయ్యేవరకు దగ్గర భద్రంగా పెట్టు కోవాలన్నారు. అధిక దిగుబడులు ఇచ్చే చీడపీడలు తట్టుకునే విత్తనాలు విత్తుకోవాలన్నారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. రసాయనిక ఎరువులు వాడకం తగ్గించుకోవాలన్నారు. అధిక దిగుబడుల కోసం పశువుల పేడ,కోళ్ల ఎరువు, తదితర సేంద్రీయ ఎరువులు వాడాలన్నారు. ఈ కార్యక్రమం లో పెద్దపల్లి ఏడిప శ్రీనాథ్, మండల ఇన్చార్జి వ్యవసాయ అధికారి భాస్కర్, ఉద్యాన శాఖ అధికారి మహేష్, ఏఈవోలు వినీత్, రాహుల్ , అఖిల, రైతులు పాల్గొన్నారు.